సాక్షి అనకాపల్లి

బుధవారం । 13 । మార్చి । 2024



ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు

చీడికాడ మండలంలో జల్‌జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన మంచినీటి ట్యాంకులను డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు ప్రారంభించారు. 8లో



ఘనంగా అష్టదళ పద్మారాధన

విశాఖ: నగరంలోని కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు.

రంజాన్ వేళలు

అనకాపల్లి
ఇఫ్తార్ (బుధ) 6.10 సహర్ (గురు) 4.53

నర్సీపట్నం
6.13 4.51

న్యూస్‌రీల్

గంగాలక్ష్మికి ఇంటి స్థలం

- వారం తిరక్కుండానే సీఎం ఆదేశం అమలు



గెడ్డపాలెంలో తనకు కేటాయించిన ఇంటి స్థలంలో గంగాలక్ష్మి, రెవెన్యూ అధికారులు

ఎస్.రాయవరం: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పినపాత్రుని గంగాలక్ష్మికి రెవెన్యూ అధికారులు మంగళవారం ఇంటి స్థలం కేటాయించారు. గెడ్డపాలెం గ్రామానికి చెందిన పినపాత్రుని గంగలక్ష్మి విద్యుత్ ప్రమాదంలో భర్తను కోల్పోయింది. బీమా సొమ్ము రాలేదని, నివసించడానికి ఇల్లు కూడా లేదని ఇటీవల అనకాపల్లి పిసినికాడ సభకు వచ్చిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మొర పెట్టుకుంది. స్పందించిన సీఎం వెంటనే రెండు లక్షల చెక్కును అందజేసి, ఇంటి స్థలం కేటాయించాలని ఆదేశించారు. అదే రోజు కలెక్టర్ రెండు లక్షల చెక్కును అందివ్వగా.. మంగళవారం గెడ్డపాలెం గ్రామంలో జగనన్న కాలనీ లేఅవుట్‌లో సెంటున్నర స్థలం కేటాయించారు. వెంటనే స్థలం అప్పగించారు. సీఎం ఆదేశాలతో తమ కుటుంబానికి మరచిపోలేని మంచి జరిగిందని గంగాలక్ష్మి కుటుంబ సభ్యులు సంతృప్తి వ్యక్తపరిచారు. తహసీల్దార్ జగలక్ష్మి ఆదేశాల మేరకు తిమ్మాపురం, గెడ్డపాలెం వీఆర్వోలు గోపి, మణికుమార్ ఇంటి స్థలాన్ని గంగాలక్ష్మికి అప్పగించారు. ఆన్‌లైన్ రికార్డులో లబ్ధిదారు పేరు నమోదయ్యిందని, పట్టా ప్రింటింగ్ పూర్తికాగానే అందజేస్తామన్నారు.

చిరుతపులి చర్మం అక్రమ రవాణా


- స్వాధీనం చేసుకున్న డీఆర్‌ఐ అధికారులు
- నలుగురు అరెస్ట్



డీఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్న చిరుతపులి చర్మం

విశాఖ సిటీ: చిరుతపులిని వేటాడి దాని చరాన్ని అక్రమంగా రవాణా చేస్తున్న ముఠాకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్‌ఐ) అధికారులు మంగళవారం విశాఖలో చెక్ పెట్టారు. వివరాల్లోకి వెళితే.. చిరుతపులి చర్మాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు డీఆర్‌ఐ అధికారులు విశ్వసనీయవర్గాల సమాచారంతో విశాఖలో నిఘా పెట్టారు. నగరంలో ఒక హోటల్ వద్ద ముగ్గురు వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో వారిని తనిఖీ చేశారు. వారి వద్ద చిరుతపలి చర్మాన్ని గుర్తించారు. చిరుతపులిని వేటాడి దాని చర్మాన్ని విక్రయించడానికి విశాఖ మీదుగా తరలించడానికి ప్రయత్నిస్తున్నట్లు నిందితులు అంగీకరించారు. ఆ ముగ్గురుతో పాటు మరో వ్యక్తి కూడా ఇందులో కీలక పాత్ర ఉందని అధికారులు తెలుసుకున్నారు. వారి సమాచారంతో అతడిని కూడా అదుపులోకి తీసుకున్నారు.

విశాఖ చేరుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు



విమానాశ్రయం నుంచి బయటకు వస్తున్న ఢిల్లీ క్యాపిటల్స్ కెప్టెన్ రిషబ్‌పంత్

గోపాలపట్నం : ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు సభ్యులు 12 మంది మంగళవారం సాయంత్రం విశాఖ చేరుకున్నారు. విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గంలో రాడిసన్ బ్లూ హోటల్‌కు వెళ్లారు. ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు ఈ నెల 31న చెన్నైతోను, ఏప్రిల్ 2న కోల్‌కత్తా నైట్ రైడర్స్‌తో తలపడుతోంది. విశాఖ వాతావరణానికి అలవాటు పడడంతోపాటు ఇక్కడ ప్రాక్టీస్ చేసేందుకు ముందుగా వచ్చారు.

బయోమెట్రిక్‌పై 28 మందితో కమిటీ

ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం తలపెట్టిన బయోమెట్రిక్ అటెండెన్స్‌పై యాజమాన్యం 28 మందితో కమిటీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. బయోమెట్రిక్ అమలుకు కార్మిక సంఘాలు నిరాకరించి యాజమాన్యంపై ఒత్తిడి తెచ్చాయి. దాంతో బయోమెట్రిక్ అమలుతో తలెత్తే సమస్యల పరిష్కారానికి యాజమాన్యం కమిటీ ఏర్పాటుకు అంగీకరించింది. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన కమిటీలో యాజమాన్యం నుంచి ఆరుగురు ప్రతినిధులు కాగా మిగిలిన 22 మంది కార్మిక సంఘాలకు చెందినవారు. ఏర్పాటు చేసిన కమిటీ మంగళవారం మధ్యాహ్నం తొలి సమావేశం నిర్వహించింది. రెండు నెలల్లోగా కమిటీ తమ నివేదికను సమర్పించనుంది.



దేవరాపల్లి : ఎ.కొత్తపల్లిలో కేక్ కట్ చేస్తున్న ఉప ముఖ్యమంత్రి ముత్యాలనాయుడు



నర్సీపట్నం: వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసిన అనంతరం మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణేష్



అనకాపల్లి: కేక్ కట్ చేసి ఆనందం పంచుకుంటున్న ఎంపీ సత్యవతి, బొడ్డేడ ప్రసాద్, మలసాల భరత్, దిలీప్‌కుమార్

ప్రజల గుండె చప్పుడు వైఎస్సార్‌సీపీ

- రాజన్న ఆశయాలను నెరవేర్చడానికి పుట్టిన పార్టీ
- విప్లవాత్మక పాలనతో పేదల మనసుల్లో సుస్థిర స్థానం
- జిల్లా అంతటా ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం

దేవరాపల్లి/సాక్షి న్యూస్ నెట్‌వర్క్: రాజశేఖరుడి ఆశయ సాధనే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థాపించిన వైఎస్సార్‌సీపీ అనతి కాలంలోనే పేద ప్రజల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించుకొని దేశంలోనే తిరుగులేని శక్తిగా జైత్రయాత్ర సాగిస్తోందని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు అన్నారు. జిల్లా అంతటా మంగళవారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా జరిగింది. నాయకులు, కార్యకర్తలు పార్టీ జెండా ఎగురవేసి, దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాల వద్ద నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచుకొని వేడుక చేసుకున్నారు. దేవరాపల్లి మండలంలోని ఎ.కొత్తపల్లిలో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవంలో డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు పాల్గొన్నారు. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి, వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి, అందరితో ఆనందం పంచుకున్నారు. ఈ సందర్భంగా బూడి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో తెలుసుకున్న ప్రజా సమస్యలను అధికారంలోకి వచ్చాక చిత్తశుద్ధితో పరిష్కరించి, ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారన్నారు. 2019లో వైఎస్సార్‌సీపీ అఖండ విజయమే ఇందుకు నిదర్శనమన్నారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో సైతం అఖండ విజయంతో జగన్‌మోహన్‌రెడ్డి రెండోసారి ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కిలపర్తి భాస్కరరావు, జిల్లా మహిళా సంయుక్త కార్యదర్శి రొంగలి నారాయణమ్మ, మండల అధ్యక్షుడు బూరె బాబూరావు, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, కొప్పల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర డైరక్టర్ డా. వరదపురెడ్డి సింహాచలనాయుడు, జేసీఎస్ మండల కన్వీనర్ కెవి.రమణ, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు గొర్రుపోటు రమాదేవి, సర్పంచ్ గంధం రామకృష్ణ పాల్గొన్నారు. అనకాపల్లి రింగ్‌రోడ్డులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఎంపీ సత్యవతి, అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పాల్గొన్నారు.

చోడవరం వెంకన్నపాలెం జంక్షన్ వద్ద దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, పార్టీ సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు నివాళులర్పించారు. అంతకు ముందు కార్యాలయంలో పార్టీ జెండా ఎగురవేశారు. యలమంచిలిలోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నబాబు రాజు పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద దివంగత మహానేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి పాల్గొన్నారు. ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ నర్సీపట్నం మున్సిపల్ స్టేడియంలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరిపారు. నక్కపల్లి మండలం దేవవరంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ పాల్గొన్నారు. పార్టీ పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు ఎస్.రాయవరంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు కోటవురట్లలో, ఉమ్మడి విశాఖ వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు పాయకరావుపేట మండలంలో గల మాసాహేబుపేట గ్రామంలో జరిగిన కార్యక్రమాల్లో పాల్గొన్నారు.



నక్కపల్లి: దేవవరంలో వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



చోడవరం: వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ, సీనియర్ నాయకుడు చొక్కాకుల వెంకట్రావు



ఎస్.రాయవరం: కేక్ కట్ చేస్తున్న పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు



యలమంచిలి: వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద పార్టీ జెండా ఎగురవేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్తగా అమర్‌నాథ్



సాక్షి, విశాఖపట్నం: ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ గాజువాక నియోజకవర్గ సమన్వయకర్తగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను నియమించారు. ఈ మేరకు మంగళవారం పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. అమర్‌నాథ్ గతంలో ఉమ్మడి విశాఖ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం పరిశ్రమల శాఖ మంత్రిగా, ఉమ్మడి విశాఖ జిల్లా డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్‌గా పని చేస్తున్నారు. గాజువాక నియోజకవర్గంతో ఆయన కుటుంబానికి వీడదీయరాని అనుబంధం ఉంది. వారు ఉంటున్న మింది ప్రాంతం కూడా గాజువాక నియోజకవర్గంలోనే ఉంది. ఇక్కడ బంధుగణంతో పాటు కాపు సామాజిక వర్గం, ఆయన తండ్రి గుడివాడ గురునాథరావు అభిమానులు ఎక్కువగా ఉండడం ఆయనకు కలిసొచ్చే అంశం.

రైల్వే స్టేషన్‌లో ‘బెల్లం’ స్టాల్

- ప్రారంభించిన ప్రధాని మోదీ



ప్రధాని ప్రారంభించిన స్టాల్ వద్ద స్టేషన్ మేనేజర్ సత్యనివాస్ తదితరులు

అనకాపల్లి: స్థానిక రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ‘ఒక స్టేషన్–ఒక ఉత్పత్తి’ స్టాల్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మంగళవారం వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనకాపల్లి బెల్లానికి ప్రసిద్ధి అని, అందుకే అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో బెల్లంతో తయారు చేసే పదార్థాలతో స్టాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. రైల్వేను దశలవారీగా బలోపేతం చేస్తూ వందేభారత్ రైళ్లను నడుపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ మేనేజర్ సత్యనివాస్, స్థానిక రైల్వే చీఫ్ బుకింగ్ అధికారి కామేష్, దువ్వాడ జీఆర్పీ ఎస్‌ఐ శాంతారాం, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు పాల్గొన్నారు.

నవరత్నాల విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ



డాక్యుమెంట్ ఆవిష్కరిస్తున్న ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి

బీచ్‌రోడ్డు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ లజపతిరాయ్ రూపొందించిన నవరత్నాల విజన్ డాక్యుమెంట్‌ను రాజ్యసభ సభ్యుడు వై.వి.సుబ్బారెడ్డి ఆవిష్కరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన నవరత్నాల వల్ల కలిగిన ఉపయోగాలను వివరిస్తూ రూపొందించిన డాక్యుమెంట్ అద్భుతంగా ఉందని వై.వి.సుబ్బారెడ్డి కొనియాడారు. సిరిపురంలో మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఏయూ వీసీ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30 మంది ఎంపీడీవోలకు చార్జ్‌మెమోలు

- 15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో ఖర్చు చేయని వైనం
- జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు వెల్లడి
- స్థాయీ సంఘాల సమావేశంలో పలు అంశాలపై చర్చ

మహారాణిపేట (విశాఖ): 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి సకాలంలో ఎలాంటి ప్రతిపాదనలు ఇవ్వని 30 మంది ఎంపీడీవోలకు చార్జ్ మెమోలు జారీ చేసినట్టు జిల్లా పరిషత్ సీఈవో పోలినాయుడు ప్రకటించారు. మంగళవారం జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలు జెడ్పీ ఉపాధ్యక్షురాలు బి.వరాహ సత్యవతి అధ్యక్షతన జరిగాయి. పనుల జాప్యంపై గత సమావేశంలో సభ్యులు ఆందోళన వ్యక్తం చేయగా పూర్తి స్థాయిలో విచారణ చేసి ఎంపీడీవోలకు చార్జ్‌మెమోలు జారీ చేశామని సీఈవో తెలిపారు. మండల అసిస్టెంట్ ఇంజినీర్ల (ఏఈ) నుంచి సహకారం లేకపోవడం వల్ల పనుల ప్రతిపాదనలు ముందుకు నడవడం లేదని ఎంపీడీవోలు చెబుతున్నారని, ఇదే విషయం లిఖితపూర్వకంగా ఇస్తే సంబంధిత ఏఈలపై చర్యలు తీసుకుంటామని సీఈవో ప్రకటించారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పుష్కలంగా ఉన్నాయని, పనులు చేసిన కొద్ది రోజుల్లో బిల్లులు అందజేయడం జరుగుతుందని, దీనిపై ఎవరికీ ఎలాంటి అపోహలు వద్దని తెలిపారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఊరిలో రోడ్డు, వంతెనకు ప్రతిపాదనలు ఇవ్వని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులపై సీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. మాడుగుల మండలం ఔరవాడ గ్రామంలో గొర్రిగడ్డ వాగు ప్రాంతంలో ఒక గిరిజన గ్రామంలో విద్యార్థులు వంతెన దాటి వెళ్లి చదువుకోవలసి వస్తోందని, వంతెన, రోడ్లు వేయాలని బూడి ముత్యాలనాయుడు ప్రతిపాదనలు ఇచ్చారని, దానిని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోలేదన్నారు. వంతెన దాటుతున్న సమయంలో ఇద్దరు విద్యార్థులు చనిపోయారని, పిల్లల శ్రేయస్సు దృష్టిలో పెట్టుకొని వంతెన, రోడ్డు వేయాలని నిర్ణయించి, ఉపాధి హామీ పథకం కింద పనులు మొదలు పెట్టారని, పాత రేట్ల ప్రకారం పనులు మొదలు పెడితే వారికి కూడా అధికారులు సహకారం ఇవ్వడం లేదన్నారు. దీని మీద ఎలాంటి అనుమానాలు ఉన్నా తాను లిఖితపూర్వకంగా లేఖ ఇస్తానని, తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని సీఈవో కోరారు.

అభివృద్ధికి కృషి చేయాలని పిలుపు

ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి జిల్లా అధికారులు కృషి చేయాలని జిల్లా పరిషత్ ఉపాధ్యక్షురాలు బి.వరాహ సత్యవతి పేర్కొన్నారు. ఆమె సమావేశంలో ప్రజా పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, సంక్షేమం, ఆరోగ్యం తదితర అంశాలపై జిల్లా అధికారులతో చర్చించారు. ఎన్టీపీసీ ఏరియాలో రోడ్డుకు 200 లారీలు ఓవర్ లోడుతో యాష్, బొగ్గు రవాణా చేస్తున్నాయని, దీనివల్ల స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, చర్యలు తీసుకోవాలని పరవాడ జెడ్పీటీసీ పైలా సన్యాసిరాజు కోరారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఫోను చేస్తే ఎత్తి మాట్లాడడం లేదని బుచ్చెయ్యపేట జెడ్పీటీసీ దొండా రాంబాబు అన్నారు. అనకాపల్లి ఏరియా ఆస్పత్రిలో గైనిక్ రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యక్షురాలు బి.వరాహ సత్యవతి కోరారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈవో పోలినాయుడు, చిత్రంలో ఉపాధ్యక్షురాలు సత్యవతి

చక్కెర ఉద్యోగులకు తీపి కబురు

- తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ ఉద్యోగులకు అండగా ప్రభుత్వం
- వలంటరీ రిటైర్‌మెంట్ స్కీం కింద రూ.5.18 కోట్లు విడుదల
- 28 మంది శాశ్వత, 228 మంది తాత్కాలిక ఉద్యోగులకు లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు
- 2020లోనూ రైతుల బకాయిలకు రూ.5 కోట్లు చెల్లింపు

హామీలు ఇవ్వడమే కాదు.. వాటిని నెరవేర్చడంలోనూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి సాటిలేరు. గత టీడీపీ ప్రభుత్వం రోడ్డున పడేసిన తుమ్మపాల చక్కెర కర్మాగార ఉద్యోగుల ఆర్థిక కష్టాలను గుర్తించారు. వీఆర్ఎస్ కింద నిధులు విడుదల చేసి ఆనందం నింపారు. ఇక ఆశలు వదులుకున్న తమ జీవితాల్లో వెలుగులు నింపారని వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి, అనకాపల్లి: తుమ్మపాల సహకార చక్కెర కర్మాగార శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం తీపి కబురు అందించింది. గత టీడీపీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి మూతపడిన ఫ్యాక్టరీ క్రషింగ్ బకాయిలను సైతం వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రూ.5 కోట్లు చెల్లించింది. తాజాగా వీఆర్ఎస్ (వలంటరీ రిటైర్‌మెంట్ స్కీం) కింద 254 మంది ఉద్యోగులకు రూ.5.18 కోట్లు విడుదల చేసింది. అత్యధికంగా రూ.17 లక్షల నుంచి అత్యల్పంగా రూ.69 లక్షల వరకూ లబ్ధి చేకూర్చింది. 2018–19 సీజన్‌లో తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీలో మూణ్నెల్ల పాటు క్రషింగ్ జరిగింది. ఆ తర్వాత నుంచి ఫ్యాక్టరీని మూసివేశారు. అప్పటి రైతుల బకాయిల చెల్లింపులో గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ఈ నేపథ్యంలో 2020లో రూ.4.63 కోట్లు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసింది.



ప్రస్తుతం అందులో పనిచేసిన శాశ్వత ఉద్యోగులకు వీఆర్ఎస్ స్కీం కింద, తాత్కాలిక ఉద్యోగులకు ఎన్ఎంఆర్ కింద 5 కోట్ల 17 లక్షలు 28 వేల రూపాయలను విడుదల చేసింది. వీరిలో 27 మంది శాశ్వత ఉద్యోగులు, ఒకరు సీజనల్ పర్మినెంట్ ఉద్యోగి, 228 డైలీ వేజెస్ ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. శాశ్వత ఉద్యోగులకు రూ.5 లక్షల నుంచి రూ.18 లక్షల వరకూ లబ్ధి పొందారు. తాత్కాలిక ఉద్యోగులకు ఎన్ఎంఆర్(డైలీవేజ్) స్కీం కింద రూ.60 వేల నుంచి రూ.1.80 వేల వరకూ ప్రభుత్వం విడుదల చేసింది.

టీడీపీ హయాంలో సుగర్ ఫ్యాక్టరీ మూత...

2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ తెరుస్తామని చెప్పి నాలుగేళ్ల పాటు పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. దాంతో 2018లో రైతులంతా న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో తక్షణమే బకాయిలు ఇవ్వాలని ఆదేశించింది. రూ.30 కోట్లు బకాయిలకుగాను రూ.13 కోట్లు మాత్రమే ఇచ్చింది. మూడు నెలల పాటు క్రషింగ్ సీజన్‌లో రన్ చేసింది. ఈ పని కాలానికి డబ్బులు ఇవ్వలేదు. ఆ తర్వాత 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే అప్పటి మూడు నెలల బకాయిలను రైతులకు రూ.4.63 కోట్లు విడుదల చేసింది.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కమిటీ ఏర్పాటు..

ఫ్యాక్టరీ మూతపడటంతో జీతాలు లేక ఉద్యోగులు ఆర్థిక ఇబ్బందులకు గురైనా అప్పటి టీడీపీ పాలకులు పట్టించుకున్న పాపానపోలేదు. ప్రస్తుత ప్రభుత్వంలో స్థానిక ఎమ్మెల్యే గుడివాడ అమర్‌నాథ్, అప్పటి పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతంరెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ, వ్యవసాయశాఖ మంత్రి కురసాల కన్నబాబులతో కలిసి కమిటీ వేశారు. ఫ్యాక్టరీ నష్టాల బాట పట్టడంతో తక్షణమే వీఆర్ఎస్ స్కీం కింద ఉద్యోగులకు అండగా నిలవాలని ప్రభుత్వానికి కమిటీ సిఫార్సు చేసింది.

నేడు కార్మికులకు చెక్కుల పంపిణీ



మంత్రి అమర్‌నాథ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కార్మిక సంఘాల నేతలు

అనకాపల్లి: తుమ్మపాల సుగర్ ఫ్యాక్టరీ రెగ్యులర్, దినసరి వేతన కార్మికుల బకాయిలను బుధవారం మంత్రి అమర్‌నాథ్ చేతుల మీదుగా అందజేయనున్నట్టు కార్మిక సంఘం నేతలు తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డులోని మంత్రి కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేయనున్నట్టు చెప్పారు. వారు మంగళవారం మిందిలో మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఫ్యాక్టరీ కార్మికులు బకాయిల కోసం చాలా కాలం నుంచి ఎదురుచూస్తున్నారని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఈ విషయం తీసుకువెళ్లడంతో ఆయన ప్రత్యేక శ్రద్ధ తీసుకొని బకాయిలు విడుదల చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఇన్‌లాండ్ వాటర్‌వేస్ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటాం..



నేను 1982లో తుమ్మపాల ఫ్యాక్టరీలో ఉద్యోగానికి చేరాను. అప్పటి నుంచి సీజనల్, శాశ్వత ఉద్యోగిగా పనిచేస్తూ వచ్చాను. 2014లో ఫ్యాక్టరీ మూతపడింది. అప్పటి టీడీపీ ప్రభుత్వం మూణ్నెల్ల పాటు ఫ్యాక్టరీని తెరిచింది. రైతులకు బకాయిలు ఇవ్వలేదు. వీటిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2020లో చెల్లించింది. ఉద్యోగాలు లేక మా కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితుల్లో మాకు వీఆర్ఎస్(వలంటీర్ రిటైర్‌మెంట్ స్కీం)కింద ఈ రోజు నాకు రూ.12.50 లక్షలు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించి మా కుటుంబంలో వెలుగులు నింపారు. మా కుటుంబమంతా జగనన్నకు రుణపడి ఉంటాం.

– సూరిశెట్టి బద్రినాథ్, శాశ్వత ఉద్యోగి, యూనియన్ సెక్రెటరీ

క్లుప్తంగా

బీచ్‌రోడ్డులో అల్లు అర్జున్ సందడి



అభిమానులకు అభివాదం చేస్తున్న అల్లు అర్జున్

కొమ్మాది: సినీ హీరో అల్లు అర్జున్ మంగళవారం బీచ్‌రోడ్డులో సందడి చేశారు. సుకుమార్ దర్శకత్వం వహిస్తున్న పుష్ప–2 (ది రూల్) సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను ఫిషింగ్ హార్బర్ వద్ద గల ఓ కంటైనర్‌లో చిత్రీకరిస్తున్నారు. షూటింగ్‌లో పాల్గొంటున్న ఆయన నగరంలోని ఓ రిసార్ట్‌లో ఉంటున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ సంగీత దర్శకత్వం వహిస్తున్నారు.

తలనీలాల వేలం వాయిదా

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి ఏడాదిపాటు భక్తులు సమర్పించిన తలనీలాలు విక్రయానికి మంగళవారం నిర్వహించిన బహిరంగ వేలం వాయిదా పడింది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన పలు హెయిర్ ఇండస్ట్రీస్ సంస్థలు వేలం పాటలో పాల్గొన్నాయి. గత ఏడాది రూ.10 కోట్ల 76 లక్షలకు తలనీలాల వేలం పాట వెళ్లింది. ఈఏడాది తలనీలాలకు గిరాకీ లేదంటూ పాటదారులు ఆసక్తి కనబర్చలేదు. దీంతో రూ.6 కోట్ల 10 లక్షల వద్ద హెచ్చుపాట నిలిచింది. దీంతో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి వేలం పాటను వాయిదా వేశారు.

సీతాకోక చిలుకలపై పద్యాల పోటీలు

ఆరిలోవ: సీతాకోక చిలుకలపై పద్యాల పోటీలు నిర్వహించనున్నట్టు జూ క్యూరేటర్ నందనీ సలారియా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14న ప్రపంచ సీతాకోక చిలుకల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న ఈ పోటీల్లో వయసుతో సంబంధం లేకుండా అందరూ పాల్గొనవచ్చని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు సీతాకోక చిలుకలపై రాసిన పద్యాలు, వారి పూర్తి పేరు, వయసు, ఫోన్ నంబరుతో రాసి ఈ నెల 15వ తేదీలోగా ్రఞిస్తుట జీఞజుజుఞఞుజీ . ఛొరుు మెయిల్‌కు పంపించాలని ఆమె సూచించారు.

ఎన్నికల్లో మీడియా పాత్ర కీలకం

- వాస్తవ పరిస్థితులనే చేరవేయాలి
- జిల్లాలో 1,529 పోలింగ్ కేంద్రాలు, 12,78,625 మంది ఓటర్లు
- 332 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తింపు
- జర్నలిస్టుల వర్క్‌షాప్‌లో కలెక్టర్ రవిపట్టన్ శెట్టి



మీడియాతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, చిత్రంలో ఎన్నికల నోడల్ అధికారి జీవీ లక్ష్మి, పర్యవేక్షకుడు రామ్మూర్తి, డీపీఆర్‌వో సాయిబాబా

సాక్షి, అనకాపల్లి: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలు విజయవంతంగా పూర్తి చేసేందుకు మీడియా పూర్తి సహకారం ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రవి పట్టన్‌శెట్టి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ వీసీ హాలులో జర్నలిస్టులకు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నోటిఫికేషన్ సమీపిస్తున్న సందర్భంగా ఎటువంటి లోటుపాట్లు కనిపించినా మీడియా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుంచి మీడియా ద్వారా వచ్చే ప్రతీ కథనంపై జిల్లా స్థాయిలో మీడియా మానిటరింగ్ కమిటీ పర్యవేక్షిస్తుందన్నారు.

ఎన్నికల ప్రక్రియలో పోలింగ్, కౌంటింగ్ అనేవి చాలా ప్రధానమైనవని, ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో ఇన్‌ఫర్మేషన్ ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో మీడియా వాస్తవ పరిస్థితులను ఎప్పటికప్పుడు ప్రచురించాలని సూచించారు.

అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించాం..

జిల్లాలో 1,529 పోలింగ్ కేంద్రాలు, 12,78,625 మంది ఓటర్లు ఉన్నారని కలెక్టర్ రవిపట్టన్ శెట్టి తెలిపారు. ఇప్పటికే అన్ని పోలింగ్ కేంద్రాలను పరిశీలించామన్నారు. పోలింగ్ గదుల్లో మంచినీరు, విద్యుత్, ఫర్నిచర్ వంటి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేసేలా ముందస్తు చర్యలు చేపట్టామని తెలిపారు. ఎన్నికల్లో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫి రికార్డింగ్ ఎప్పటికప్పుడు చేస్తామన్నారు. జిల్లాకు సరిపడా ఈవీఎంలు ఉన్నాయని, ప్రభుత్వ ఉద్యోగులు, కేంద్ర సర్వీస్ ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పిస్తామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నాటి నుంచి ఫారం–7, 8 స్వీకరణకు అవకాశం లేదన్నారు. ప్రతి నియోజకవర్గంలో ఒక స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటు చేస్తామన్నారు. అక్కడ నుంచి ఈవీఎంలు ఆయా పోలింగ్ కేంద్రాలకు పంపిణీ జరుగుతుందన్నారు. జిల్లాలో 10 వేల మంది ఎన్నికల విధుల్లో పాల్గొంటారని, వివిధ విభాగాల వారీగా వారికి ఇప్పటికే శిక్షణ ఇచ్చామన్నారు. కొత్తగా 3,500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని పూర్తిచేసి ప్రతి ఒక్కరికి ఈపిక్ కార్డులు పంపిణీ చేస్తామన్నారు.

సీఆర్పీఎఫ్, కేంద్ర పోలీసు కంపెనీలు జిల్లాకు వచ్చాయని, 200 గ్రామాల్లో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. సచివాలయ సిబ్బందిలో ఒక్కరిని మాత్రమే ఓపీవోలుగా నియమించామన్నారు. ఇప్పటికి 332 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామన్నారు. కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు డి.రామూర్తి, ఎంసీఎంసీ కమిటీ నోడల్ అధికారి జీవీ లక్ష్మి, డీపీఆర్‌వో సాయిబాబా పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షిత తాగునీరు లక్ష్యం



జి.కొత్తపల్లిలో వాటర్ ట్యాంకును ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు



వింటిపాలెంలో ఇంటింటి కుళాయి పాయింట్‌ను మహిళలతో ప్రారంభిస్తున్న బూడి

- రూ 3.67 కోట్లతో నిర్మించిన వాటర్ ట్యాంకులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రారంభోత్సవం
- నాలుగు గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు

చీడికాడ : మూడు పంచాయతీల్లోని నాలుగు గ్రామాల్లో జల్ జీవన్ మిషన్ ద్వారా నిర్మించిన మంచినీటి ట్యాంకులను, ఇంటింటి కుళాయిల ద్వారా నీటి సరఫరాను డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మంగళవారం ప్రారంభించారు. జి.కొత్తపల్లిలో రూ.1.25 కోట్లతో నిర్మించిన 60 వేల లీటర్ల వాటర్ ట్యాంకు, పైపులైన్, ఇంటింటి కుళాయిలు, జేబీపురంలో రూ.1.50 కోట్లతో నిర్మించిన 40వేల లీటర్ల వాటర్ ట్యాంకు, పైపులైన్, తునివలసలో రూ.55 లక్షలతో ఏర్పాటు చేసిన 40 వేల లీటర్ల వాటర్ ట్యాంకుతో పాటు మహిళలతో ఇంటింటి కుళాయిలను డిప్యూటీ సీఎం బూడి ప్రారంభించారు. అనంతరం వింటిపాలెంలో రూ.37లక్షలతో నిర్మించిన వాటర్ ట్యాంకును ప్రారంభించి, మహిళల చేతుల మీదుగా కుళాయిలు ప్రారంభింపజేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణులకు సురక్షిత నీటిని అందించడమే లక్ష్యంగా సీఎం జగన్ మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. మండలంలోని 23 పంచాయతీల్లో రూ. 28 కోట్లతో 100 పనులు చేపట్టగా వాటిలో 40 వాటర్ ట్యాంకులు ఉన్నాయన్నారు. ఇప్పటికే 15 వాటర్ ట్యాంకులు పూర్తి కాగా మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయన్నాయన్నారు. అన్ని గ్రామాల్లో దాదాపుగా పైపులైన్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు గొల్లవిల్లి చిన్నమ్మలు, పడాల హైమా, ఎంపీపీ కురచా జయమ్మనారాయణమూర్తి, వైస్ ఎంపీపీ ధర్మిశెట్టి స్వాతి, ఎంపీటీసీ కొల్లి నాగమణి, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు గొల్లవిల్లి రాజుబాబు, డెయిరీ డైరెక్టర్ శీరంరెడ్డి సూర్యనారాయణ, పార్టీ సీనియర్ నేతలు చుక్కా అప్పలనాయుడు, షేకు సూర్యనారాయణ, పడాల అప్పలనాయుడు, పుట్టా రాంకుమార్, కొల్లి శ్రీను, విస్సారపు జయలక్ష్మీ నాగేశ్వరరావు, వంటాకు సూర్యనారాయణ పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి

రూ.5 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్



అవినాష్‌కు రూ.5 లక్షల చెక్కును అందజేస్తున్న ఎంపీ సత్యవతి, సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్

అనకాపల్లి : రైలు ప్రమాదంలో రెండు కాళ్లు కోల్పోయిన విశాఖ జిల్లా మింది గ్రామానికి చెందిన దాడి అవినాష్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.5 లక్షల చెక్కును స్థానిక రింగ్‌రోడ్డు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎంపీ బి.వి.సత్యవతి, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ 2017 డిసెంబర్ 13న దువ్వాడ నుంచి విజయవాడ వెళ్లేందుకు దువ్వాడ రైల్వేస్టేషన్‌లో పూరి–తిరుపతి ఎక్స్‌ప్రెస్ ఎక్కుతున్న సమయంలో ప్రమాదవశాత్తూ కాలు జారిపడి పోవడంతో తీవ్రంగా గాయపడినట్టు తెలిపారు.

విశాఖ ప్రైవేట్ ఆసుపత్రిలో వైద్యం చేయించినప్పటికీ ఆపరేషన్ వికటించడంతో గత ఏడాది అక్టోబర్‌లో అనకాపల్లి ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యులను సంప్రదించగా మోకాళ్ల వద్దకు రెండు కాళ్లు తీసివేయాలని చెప్పడంతో వైద్యుల సూచనల మేరకు ఆపరేషన్ చేయించుకుని 6 నెలల పాటు చికిత్స పొందినట్టు తెలిపారు. తన తండ్రి శ్రీనివాసరావు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఉద్యోగం చేస్తూ అనారోగ్యంతో 2015లో మృతి చెందగా, తల్లి నాగమణి అనారోగ్యంతో 2016లో మృతిచెందినట్టు అవినాష్ చెప్పారు. 2017లో రైలు ప్రమాదం జరిగిందన్నారు. ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందని కారణంగా ఆపరేషన్ నిమిత్తం సీఎం రిలీఫ్ ఫండ్‌గా రూ.5 లక్షల నగదును అందించినట్లు తెలిపారు. దివ్యాంగుల పింఛను తీసుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

బీఎన్ రోడ్డు నిర్మాణం కావాలనే ఆపేశారు..

- కాంట్రాక్టర్ కుట్ర బహిర్గతం అయ్యింది
- అయినా వదిలేది లేదు..
- మండల సర్వసభ్య సమావేశంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ

రావికమతం : బీఎన్ రోడ్డు నిర్మాణాన్ని రాజకీయ నేపథ్యంలోనే కాంట్రాక్టర్ రెండేళ్లుగా నిర్లక్ష్యం చేస్తున్నాడనే మన అనుమానాలే నిజమని రుజువైందని, సదరు కాంట్రాక్టర్ తండ్రి అనంతపురం జిల్లా రాయదుర్గం టీడీపీ ఎమ్మెల్యే రేసులో ఉన్నాడని, అయినా వదిలేది లేదని 50 రోజుల్లో రోడ్డు నిర్మాణం చేయించి తీరుతానని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ధర్మశ్రీ మాట్లాడారు. నియోజకవర్గానికి ప్రధాన రహదారి అయిన బీఎన్ రహదారి అభివృద్ధికి న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు నుంచి రూ.104 కోట్లు మంజూరై మూడేళ్లు కావస్తోందని అయితే సదరు రోడ్డు పనులు తీసుకున్న ఎస్సార్ కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ చౌదరి టీడీపీ నాయకుడు కూడా కావడం వల్ల రెండడుగులు ముందుకు పది అడుగులు వెనక్కి చేస్తూ జాప్యం చేశాడని అన్నారు. సదరు కాంట్రాక్టర్‌ను పలుమార్లు నిలదీసినా పనులు చేస్తున్నట్టు నటించి మాయచేశాడన్నారు. ఇపుడాయన తండ్రి రాయదుర్గం టీడీపీ ఎమ్మెల్యే టిక్కెట్ రేసులో ఉండడంతో వాస్తవం బయట పడిందన్నారు. అయినా వదిలేది లేదని 50 రోజుల్లో పనులు పూర్తి చేయిస్తానన్నారు. మేనిఫెస్టోను దైవంలా భావించిన ముఖ్య మంత్రి జగన్‌మోహనరెడ్డిని మళ్లీ సీఎంను చేసుకుని ఇపుడున్న సంక్షేమ పథకాలతో పాటు మరిన్ని అమలు చేయించుకుందామన్నారు. చంద్రబాబు దుష్టబుద్ధితో లేనిపోని హామీలిచ్చి మరలా ప్రజలను మోసం చేయాలని చూస్తున్నాడని ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎంపీపీ పైల రాజు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ దంట్ల వెంకట రమణ, మత్స భవానీప్రసాద్, ఎంపీడీవో భానోజీరావు, తహసీల్దార్ రమణారావు పాల్గొన్నారు.

కదిలాయ్ వందేభారత్ చక్రాల్



వందేభారత్ రైల్లో కేవీ వాల్తేర్ విద్యార్థులు



విశాఖ నుంచి బయలుదేరుతున్న వందేభారత్

విశాఖ సిటీ: ఆకర్షణీయమైన ఆకారం.. విలావంతమైన సౌకర్యం.. అత్యధిక వేగం.. సుదూర ప్రాంతాలకు అత్యంత వేగంగా చేసుకొనే అత్యధిక వేగంతో ప్రయాణించే వందే భారత్ రైళ్లు విశాఖ పట్టాలపై పరుగులు పెట్టాయి. ఇప్పటివరకు ఉన్న ఒకటి కాస్తా ఉదయానికి రెండు కాగా.. సాయంత్రానికి మూడు రైళ్లు విశాఖ కేంద్రంగా ప్రయాణికులకు సౌకర్యవంతమైన రైలు ప్రయాణాన్ని అందించడానికి అందుబాటులోకి వచ్చాయి. విశాఖలో వందే భారత్ రైలు ప్రారంభోత్సవం అట్టహాసంగా జరిగింది. భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వర్చువల్ విధానంలో జెండా ఊపి రైలును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. భారీ జనసందోహం.. పిల్లల కేరింతలు.. యూట్యూబర్ల షూటింగ్‌ల హడావుడి మధ్య విశాఖపట్నం–భువనేశ్వర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఉదయం విశాఖ రైల్వేస్టేషన్ నుంచి బయలుదేరింది. వాల్తేరు డివిజన్ రైల్వే అధికారులు ఈ రైలు విశేషాలు, సౌకర్యాలు విద్యార్థులకు, యూట్యూబర్లకు వివరిస్తూ పలాస వరకు తీసుకువెళ్లారు. రైలులోనే స్టార్ హోటల్ తరహా ఆహారాన్ని అందజేశారు. రైలు వేగం.. అందులో సౌకర్యాలను చూసి విద్యార్థులు కేరింతలు కొట్టారు.

అలాగే రాత్రి సికింద్రాబాద్ నుంచి విశాఖ రైల్వేస్టేషన్‌కు మరో వందే భారత్ రైలు చేరుకుంది. దీనికి కూడా రైల్వే అధికారులు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. ఈ రైలు సందర్భంచేందుకు ఇతర రైలు ప్రయాణికులు సైతం పోటీ పడ్డారు.

కేవీ వాల్తేర్ విద్యార్థుల సందడి

కంచరపాలెం: విశాఖ –భువనేశ్వర్ మధ్య ప్రారంభమైన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైల్లో తాటిచెట్లపాలెం వాల్తేర్ కేంద్రీయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు మంగళవారం సందడి చేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులకు అవకాశం కల్పించిన వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్‌కు పాఠశాల ప్రిన్సిపాల్ కమల్‌జిత్ కృతజ్ఞతలు తెలిపారు.

సీవీ రామన్ టాలెంట్ టెస్ట్‌లో శ్రీప్రకాష్ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన విద్యార్థులు

పాయకరావుపేట : విద్యార్థుల్లో దాగి వున్న ప్రతిభా పాటవాలను వెలికి తీసేందుకు జనవరి 27 న రాష్ట్ర వ్యాప్తంగా సుచిర్ ఇండియా ఫౌండేషన్ జనరల్ నాలెడ్జ్, మాథ్స్ సైన్స్ విభాగాలలో నిర్వహించిన 31 వ సీవీ రామన్ ఒలింపియాడ్ టాలెంట్ టెస్ట్‌లో శ్రీ ప్రకాష్ విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఎం.దీప్య 6వ తరగతి, ఇ.నవీన్ హర్ష 5వ తరగతి, రాష్ట్ర స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. వీరు సీవీ రామన్ టాలెంట్ టెస్ట్‌లో రాష్ట్ర స్థాయి యంగ్ జీనియస్ అవార్డులు సాధించారని విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ తెలిపారు. వీరితో పాటు జిల్లా స్థాయిలో టి. గ్రీష్మశ్రీ (3వ తరగతి) డి.విఖ్యాత్ (4వ తరగతి), ఎస్.కౌశల్ కార్తికేయ (6వ తరగతి), జి.లిఖిత్ (7వ తరగతి), కె.గిరిచరణ్ (8వ తరగతి) ప్రథమ స్థానం సాధించారు. ద్వితీయ స్థానంలో ఎ.సాత్విక (3వ తరగతి), ఎ.జయంత్ (5వ తరగతి), ఆర్.లలిత (10వ తరగతి) నిలిచారని తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు వచ్చే నెల 4తేదీన హైదరాబాద్ శ్రీ సత్యసాయి నిగమాగమంలో జరిగే కార్యక్రమంలో జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు, జగదు బహుమతి అందజేస్తారని తెలిపారు. ఆయా విద్యార్థులను విద్యా సంస్థల అధినేత నరసింహారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

షామియానా కూలి విద్యార్థులకు గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

యలమంచిలి రూరల్: పట్టణంలోని భాష్యం స్కూల్ ఆధ్వర్యంలో స్థానిక రాజీవ్ క్రీడా మైదానంలో నిర్వహించిన జోనల్ స్పోర్ట్స్ మీట్‌లో మంగళవారం అపశృతి చోటు చేసుకుంది. క్రీడా పోటీలు ప్రారంభమైన కొద్దిసేపటికే అక్కడ విద్యార్థులు కూర్చోవడానికి ఏర్పాటు చేసిన పెద్ద షామియానా ఒక్కసారిగా కూలిపోయింది. దీంతో దాని కింద, సమీపంలో కూర్చున్న విద్యార్థులంతా భయంతో పరుగులు తీశారు. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులు స్వల్పంగా గాయపడగా వారిలో 8వ తరగతి చదువుతున్న చోడవరం భాష్యం స్కూలుకు చెందిన బాలిక తీవ్రంగా గాయపడింది. షామియానా కర్ర చివరన ఉన్న పెద్ద ఇనుప ముక్క విద్యార్థిని తలపై పడింది. దీంతో బాలికను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. వైద్యాధికారి సుభాష్ బాలిక తలకు మూడు కుట్లు వేశారు. మరో ఇద్దరు విద్యార్థులు కూడా స్వల్పంగా గాయపడ్డారు.

బైక్ అదుపు తప్పి యువకుడి మృతి



మృతుడు కిరణ్ (ఫైల్)

నర్సీపట్నం : మున్సిపాలిటీ శారదనగర్ వినాయక ఆలయం రోడ్డు మలుపు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. టౌన్ సీఐ కాంతి కుమార్ తెలిపిన వివరాలివి. నర్సీపట్నం మండలం, గురంధరపాలెంకు చెందిన కోసూరు కిరణ్(24) డిగ్రీ వరకు చదువుకున్నాడు. ద్విచక్రవాహనంపై బలిఘట్టం వైపు నుంచి నర్సీపట్నం వస్తుండగా బైక్ అదుపు తప్పడంతో ప్రమాదానికి గురయ్యాడు. తలకు బలమైన గాయం తగలడంతో కిరణ్ సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆస్పత్రికి తరలించారు. జరిగిన సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

1800 లీటర్ల పులుపు ధ్వంసం



స్వాధీనం చేసుకున్న ప్లాస్టిక్ డ్రమ్ములు

పాయకరావుపేట : నక్కపల్లి మండలం చినదొడ్డిగొల్లు పరిసర ప్రాంతాల్లో నాటు సారా బట్టీలపై దాడులు నిర్వహించి 1800 లీటర్ల సారా తయారీకి ఉపయోగించే పులుపును ధ్వంసం చేసినట్టు ఎస్ఈబీ సీఐ ఎస్.ధర్మారావు తెలిపారు. సారా కాపు పులుపును నిల్వ చేసిన డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ ఎస్.ధర్మారావు తెలిపారు.

సింగిల్ మేజర్ సబ్జెక్టులపై శిక్షణ ప్రారంభం



మాట్లాడుతున్న కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి

డాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం సింగిల్ మేజర్ సబ్జెక్టులపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు నోడల్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జువాలజీ, బయో టెక్నాలజీ, బయో కెమిస్ట్రీ సబ్జెక్టులకు సంబంధించి జిల్లాలోని అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ వై.లక్ష్మి మాట్లాడుతూ అధ్యాపకులు నూతన విద్యా విధానం, పరిశోధనలకు సంబంధించిన నూతన పోకడలు తెలుసుకుని వినూత్న బోధన అందించడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్‌సీ కో ఆర్డినేటర్ డాక్టర్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అనుమానాస్పద మృతి

మర్రిపాలెం : కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ మహిళ ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు ఫిర్యాదు అందింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం సుభాష్‌నగర్‌కు చెందిన సీరం సత్యవేణి (46)కి సీరం సురేష్‌తో 1999లో వివాహం జరిగింది. సురేష్ ఎయిర్‌పోర్టులోని ఇమిగ్రేషన్ డిపార్ట్‌మెంట్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పిల్లల చదువుల కోసం చాలామంది వద్ద సత్యవేణి అప్పులు చేసింది. మృతురాలి తల్లిదండ్రులు మురళీనగర్‌లో ఉంటారు. సోమవారం సాయంత్రం సత్యవేణిని ఇంటికి తల్లి రమణమ్మ వెళ్లింది. మంగళవారం ఉదయం రమణమ్మ తిరిగి మురళీనగర్‌లోని తన ఇంటికి వచ్చేసింది. కాసేపటి తర్వాత తన కుమార్తె మృతి చెందినట్టు అల్లుడు ఫోన్‌చేసి చెప్పడంతో ఆమె హుటాహుటిన కుమార్తె ఇంటికి చేరుకుంది. అల్లుడు,కుమార్తె మధ్య ఎటువంటి మనస్పర్థలు లేవని, తమ కుమార్తె మృతిపై ఎటువంటి అనుమానాలు లేవని రమణమ్మ ఫిర్యాదులో పేర్కొంది. సీఐ ఎస్ భాస్కరరావు నేతృత్వంలో ఎస్ఐ షేక్ సమీర్ కేసు దర్యాప్తు చేపట్టారు.

పారిశుధ్యం మెరుగుకు ఐవోసీఎల్ చేయూత



జేసీబీ డాక్యుమెంట్‌లను ఎమ్మెల్యే కన్నబాబు చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్‌కు అందజేస్తున్న ఐవోసీఎల్ డిప్యూటీ జనరల్ మేనేజరు ప్రసాద్

యలమంచిలి : పట్టణంలో ప్రజారోగ్య భద్రత దృష్ట్యా పారిశుధ్యం మెరుగుపరచడానికి ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్) యాజమాన్యం చేయూతనందిస్తోందని ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తిరాజు (కన్నబాబు) అన్నారు. మంగళవారం యలమంచిలి మున్సిపాలిటీకి ఐవోసీఎల్ టెర్మినల్ అచ్యుతాపురం యాజమాన్యం రూ.25 లక్షలతో కొనుగోలు చేసిన మినీ జేసీబీ వాహనాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. మరో రూ.25 లక్షలతో గార్బేజ్ కాంపాక్టర్‌ను కొనుగోలు చేసి త్వరలోనే సంస్థ అందజేస్తుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ వాహనాలతో డ్రైయినేజీలో పూడికతీత తొలగింపుతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను వేరు చేసి రీ సైక్లింగ్ చేయడానికి ఉపయోగపడతాయన్నారు. ఐవోసీఎల్ అచ్యుతాపురం టెర్మినల్ డిప్యూటీ జనరల్ మేనేజర్ డి.పి ప్రసాద్ కొత్తగా కొనుగోలు చేసిన వాహనం డాక్యుమెంట్‌లను మున్సిపల్ కమిషనర్ కొండలరావుకు అందజేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి ఐవోసీఎల్ జనరల్ మేనేజరు ప్రసాద్‌కు ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్‌వర్మ, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్రెపు గుప్తా, మేనేజరు ప్రభాకరరావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బొద్దపు యర్రయ్యదొర, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు కొండబాబు, నియోజకవర్గ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు రాజాన మహాలక్ష్మి ,పిట్టా సత్తిబాబు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాల లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ



జగనన్న కాలనీల్లో ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేసిన ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: ఇల్లు లేని పేదలంటూ ఉండకూడదని, అందరికీ సొంతిల్లు మంజూరు చేసిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ అన్నారు. జగనన్న ఇళ్ల స్థలాలు రిజిస్ట్రేషన్ పత్రాలు లబ్ధిదారులకు వెంకన్నపాలెం, చోడవరం సచివాలయం–3, గాంధీగ్రామం గ్రామాల్లో మంగళవారం పంపిణీ చేశారు.ఈ మూడు గ్రామాల్లో 380 మందికి ఇంటి స్థలం రిజిస్ట్రేషన్ పత్రాలు పంపిణీ చేశారు. ఆ ఇంటి స్థలంపై పూర్తిగా రిజిస్ట్రేషన్ హక్కు కల్పించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో సుమారు 4800 మందికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉచితంగా ఇంటి స్థలం ఇచ్చి, హౌసింగ్‌స్కీమ్‌లు మంజూరు చేసిందన్నారు. లబ్ధిదారులందరూ పూర్తిగా ఇళ్లను నిర్మించుకొని సొంతింటి కలను సాకారం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ వేణుగోపాలరావు, ఎంపీపీ గాడి కాసు, సర్పంచ్‌ల బండి నూకాలమ్మశ్రీను, గాడి అప్పారావు, మొల్లి ఈశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొడ్డి వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి నెహ్రూ, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, హౌసింగ్ ఏఈ రమణమూర్తి, వీఆర్‌లు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Single Sitting : 10th, Inter, BA, B.Com, B.Sc, BED, BPED, UGDPED, BBA, MBA, DMLT, BMLT, BNYS, BAMS, BHMS, B.Tech, NURSING ITI, Pharmacy, LLB, Phd : 81435 83986. [L-806434]

DISTANCE EDUCATION

■ ఆంధ్రా యూనివర్సిటీ డిస్టెన్స్ ఎడ్యుకేషన్: BA, B.Com, B.Sc., MA, M.Com., M.Sc., MBA & MCA అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఫోన్: 73862 63237, 90590 86040 [V-2429]

Services

GOLD LOANS

■ లోకేష్ గోల్డ్ లోన్స్ :– బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :– 98484 88068/ 77992 23300 [V- 11800]

Wanted

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 90596 63584, 95026 15217. [M-1233882]

■ ప్రముఖ కంపెనీలో వర్క్ ఫ్రమ్ హోం స్త్రీ/పు కావలెను. జీతం : 15–25 వేలు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. సంప్ర. 95027 12418, 90306 12463. [M-1233881]

■ న్యూఢిల్లీలో ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబంలో 1 సం వయస్సు గల బాబును చూసుకోవడానికి కేర్ టేకర్ కావలెను. వసతి భోజనం కలదు. ✆ 93969 71848. [O-759045]

■ Free Software Traning : B.Tech - Degree 21, 22, 23 Pass Outs, 4 Months Duration @ Dwarakanagar. Ph : 99633 66009, 95739 79344 [V-5548]

సినిమా వార్తల కోసం లాగ్ఆన్ అవ్వండి www.sakshi.com

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రియల్టీ సమాచారం కొరకు లాగాన్ కండి www.sakshi.com

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

అనకాపల్లి : 9010546644
యలమంచిలి : 9951602901
చోడవరం : 9010210265
నర్సీపట్నం : 9010234557
పాడేరు : 9010973030

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

క్లుప్తంగా

రంజాన్ ప్రార్థనలు ప్రారంభం

కశింకోట: కశింకోటలో ముస్లింలు పవిత్రమైన రంజాన్ దీక్షలు మంగళవారం ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు నిష్టగా ఉపవాసం చేసి సాయంత్రం ఇక్కడి జామియా, నూరి మసీదుల్లో సంప్రదాయంగా దీక్షలు విరమిం చారు. మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వ హించారు. అలాగే నరసింగబిల్లిలోని మసీ దులో కూడా ముస్లింలు దీక్షలు జరిపారు.

ఘనంగా 'ఐద్వా' ఆవిర్భావ వేడుకలు



కశింకోటలో ఐద్వా పతాకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

కశింకోట: కశింకోటలో అఖిత భారత ప్రజా తంత్ర మహిళా సంఘం (ఐద్వా) ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఇక్కడ జెండా ఎగుర వేశారు. ఐద్వా జిల్లా నాయకురాలు డి.డి. వరలక్ష్మి మాట్లాడుతూ మహిళల రక్ష ణకు రూపొందించిన చట్టాలను పక్కాగా అమలు చేయాలన్నారు. మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలన్నారు. మహిళా ప్రతినిధులు నాగ మణి, ఎం.స్వప్న, ఎ.పుష్ప, డి.రేవతి, వీఎల్ సింధూజ సత్యవతి, శ్రీదేవి, లక్ష్మి, ప్రవీణ పాల్గొన్నారు.

రహదారి భద్రతపై అవగాహన



జాతీయ రహదారిపై ర్యాలీ చేస్తున్న మహిళలు, వెలుగు సిబ్బంది

కశింకోట: కశింకోటలో రహదారి భద్రతపై స్వయం సహాయక సంఘాల మహిళలు అవ గాహన కల్పిస్తూ మంగళవారం ర్యాలీ నిర్వ హించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించా లని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరిం చాలని, నాలుగు చక్ర వాహనదారులు సీటు బెల్టులు ధరించాలని నినాదాలు చేశారు. వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు, మహిళా సంఘాల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొ న్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 7,855 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	3,700	4,440
మొదటి రకం	3,580	4,260
రెండో రకం	3,450	3,740
మూడో రకం	3,250	3,460

అనకాపల్లి సినిమాలు

ఈగల్	: రాజా
గామి	: సత్యనారాయణస్క్రీన్-1
ప్రేమలు	: సత్యనారాయణస్క్రీన్-2
సిద్దార్థరోయ్	: షిర్డిసాయి
ఊరు పేరు భైరవకోన	: పర్తిసాయి
ఆపరేషన్ వాలెంటైన్	: వెంకటేశ్వర
రికార్డుబ్రేక్	: శ్రీసత్య
భీమా	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 62 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-11 యూనిట్లు, బీ పాజిటివ్-34 యూనిట్లు, ఓ పాజిటివ్-16 యూనిట్లు, ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్‌ను 97036 19706 నంబరు ద్వారా సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళ వారం 393 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 327 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధిని 08924-223595 నం బరు ద్వారా సంప్రదించవచ్చు.

సాక్షి
మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
9966329167, 9912440601

మరోసారి వైఎస్సార్‌సీపీ విజయం ఖాయం

- పార్టీలన్నీ ఏకమైనా ప్రజలంతా సీఎం జగన్ పక్షమే..
- ఎంపీ సత్యవతి
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవం



పార్టీ జెండా ఎగురవేస్తున్న ఎంపీ సత్యవతి, బొడ్డేడ ప్రసాద్, మలసాల భరత్‌కుమార్, దంతులూరి దిలీప్‌కుమార్

అనకాపల్లి: వైఎస్సార్ ఆశయ సాధన కోసం ఏర్పా టైన వైఎస్సార్‌సీపీ దినదిన ప్రవర్థమానమై ప్రజల మన్ననలు అందుకుంటోందని ఎంపీ బీవీ.సత్యవతి అన్నారు. జన శ్రేయస్సు కోసం నిరంతరం తపించే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పక్షాన ప్రజలున్నారని, పార్టీలెన్ని కలిసి వచ్చినా మళ్లీ విజయం వైఎస్సార్‌సీ పీనే వరిస్తుందన్నారు. వైఎస్సార్‌సీపీ 14వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె జెండాను ఆవి ష్కరించారు.

ఎంపీ సత్యవతి, బొడ్డేడ ప్రసాద్, భరత్‌కుమార్ కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. ఈ సందర్భం గా ఎంపీ మాట్లాడుతూ ప్రతిపక్షాలు ఎన్ని విమర్శలు చేసినా ప్రజల సంక్షేమంపైనే దృష్టి సారిస్తూ లక్షల కోట్ల రూపాయలను అభివృద్ధి, సంక్షేమం కోసం వెచ్చించిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కింద న్నారు. కరోనా వంటి విపత్కర సమయంలోనూ సం క్షేమ పథకాలను అమలు చేసి, సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నార న్నారు. రానున్న ఎన్నికల్లో పేదల ప్రభుత్వాన్ని ఓడిం చేందుకు టీడీపీ-జనసేన-బీజేపీ ఏకమయ్యాయ న్నారు. చంద్రబాబుకు ఎప్పుడూ ఒంటరిగా పోటీ చేసే సత్తా లేదన్నారు. కానీ.. తమ పార్టీ ×మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం× నినాదంతో ఒంటరిగానే పోటీ చేస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రజలు మరోసారి తమ పార్టీని ఆశీర్వదించి మరిన్ని సంక్షేమ పథకాలు అందుకోవాలని కోరారు.

మరోసారి పార్టీ జెండా ఎగరవేద్దాం

పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ దేశంలో వందేళ్లకు పైగా చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ అధినేత సోనియాగాంధీని ఎదిరించి రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీని స్థాపించి, గ్రామస్థాయి నుంచి బలోపేతం చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎ స్సార్ మృతితో రాష్ట్రంలో సుమారు 900 మంది మరణిస్తే వారి కుటుంబాలను ఓదార్చేందుకు జగన్ యాత్ర చేస్తుండగా అప్పటి టీడీపీతో ఎన్నో కేసులు పెట్టించిన రోజులను కాంగ్రెస్ నేతలు మార్చిపోయారా అంటూ విమర్శించారు. ఎవరెన్ని రకాలుగా పొత్తులు పెట్టుకున్నా రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ జెండా ఎగరడం ఖాయమ న్నారు. ఇందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

పార్టీ విజయానికి కృషి

నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కు మార్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కార్యకర్త లందరూ సైనికుల్లా పని చేసి పార్టీ విజయానికి కృ షి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజలు ఓటింగ్‌కు సిద్ధంగా ఉన్నారని, వారిచేత ఓటు వేయించుకునే బాధ్యత మనపార్టీ శ్రేణులపై ఉందన్నారు. ఏపీఐ డబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మాట్లా డుతూ రాష్ట్రంలో దొంగలందరూ ఏ విధంగా ఏకమ య్యారో అనకాపల్లి నియోజకవర్గంలో కూడా అదే విధంగా ఏకమైనట్లు చెప్పారు. నాయకులంతా టీడీ పీ-జనసేన-బీజేపీలో ఉన్నప్పటికీ లోలోపల సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కోవాలంటే వారికి వెన్నులో భయం పుడుతోందన్నారు. కార్యక్రమం లో పార్టీ రాష్ట్ర యువజన విభాగ కార్యదర్శి పలకా రవి, జిల్లా ఎస్సీ సెల్ మహిళా విభాగం అధ్యక్షు రాలు సుజాత, జిల్లా ప్రధాన కార్యదర్శి సూరిశెట్టి రమణ అప్పారావు, కశింకోట, అనకాపల్లి మండల పార్టీల అధ్యక్షులు మలసాల కిశోర్, పెదిశెట్టి గోవిం ద్, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, ఎంపీపీ గొర్లి సూరిబాబు, జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పలు ఆలయాల చైర్మన్లు కొణతాల ముర ళీకృష్ణ, కేఎం.నాయుడు, నుదురుపాటి తాతాజీ పాల్గొన్నారు.

చట్ట సభల్లో మహిళలకు పెరిగిన ప్రాధాన్యం



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మి

కశింకోట: మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ ముం దుకు దూసుకుపోతున్నారని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. కశింకోటలోని మండల మహిళా సమా ఖ్య కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్ట సభల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగిందన్నారు. విద్య, ఉద్యోగాల్లో మహిళా శక్తి ముందుంటుందన్నారు. వెలుగు ఏపీఎం ఎస్. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థిక స్వావలంబన సాధించాలని కోరారు. వైఎస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వేపాడ లక్ష్మి, కార్యదర్శి నాగలక్ష్మి, కోశాధికారి పార్వతిలను సత్కరించారు. మహిళ లకు కుర్చీలాట, పాటల పోటీ నిర్వహించి విజేత లకు బహుమతులు అందజేశారు. సీసీలు నిర్మల, అనూరాధ, రామకృష్ణ, శ్రీను, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌దే..



లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాన్ని అందిస్తున్న మలసాల భరత్‌కుమార్



హాజరైన లబ్ధిదారులు

అనకాపల్లి: పేదోడికి సొంతింటి కల నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుం దని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక వేల్పుల వీధి సీతారామ కల్యాణమండపంలో పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు -1 ఉగ్గిన అప్పారావు అధ్యక్షతన మంగళవారం 6, 7, సచివా లయాల పరిధిలో 250 మంది లబ్ధిదారులకు జగ నన్న గృహ రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేయింబవళ్లు కష్టించిన శ్రామిక పేదవర్గాలకు తమ ప్రభుత్వం సొంత స్థలం సమకూర్చిందని, ఆ స్థలానికి శాశ్వ తహక్కు కల్పిస్తూ ఉచిత రిజిస్ట్రేషన్లు కల్పించి పత్రాలు అందజేయడంతో అన్నివర్గాల్లో వెలుగులు నిండాయని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వంలో సాధ్యం కాని సంక్షేమ, అభివృద్ధి జగనన్న ప్రభుత్వంలో చూస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీని మరోసారి ఆశీర్వదించాలని ఆయన కోరారు. అంత కుముందు మండలంలో అక్కిరెడ్డిపాలెం గ్రామంలో నూకాంబిక అమ్మవారి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా ఆయన అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, పార్టీ శ్రేణులు బొండా శంకరరావు, వేల్పుల గణేష్, గొర్లి చిన్న, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న మధుబాబు

అనకాపల్లి: తహసీల్దార్ శ్రీనివాసరావును తన కార్యా లయంలో మంగళవారం జిల్లా విజిలెన్స్ మోనటరిం గ్ కమిటీ (డీవీఎంసీ) సభ్యుడు రేబాక మధుబాబు మర్యాదపూర్వకంగా కలిసి దళిత సమస్యలను పరిష్క రించాలని కోరారు. అంతకుముందు తహసీల్దార్ శ్రీని వాసరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోన టరింగ్ జిల్లా నాయకులు రేబాక ఇంద్రకుమార్, ఉడత రాముడు పాల్గొన్నారు.

దళితులకు రాజకీయ గుర్తింపునివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవుడు

అనకాపల్లి: అంబేడ్కర్ ఇండియా మిషన్‌ ద్వారా జిల్లాలో 1500 మంది సభ్యత్వ పొందినట్లు మిషన్ జిల్లా అధ్యక్షుడు దేవుడు చెప్పారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయపరంగా దళితులకు గుర్తింపునివ్వాలని, అలా గుర్తించిన పార్టీలకే తమ మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపా ధ్యక్షుడు భోగేష్, జిల్లా కార్యదర్శి గొంది అప్పారావు, కో కన్వీనర్ మఠ్రా రాజు, 3 మండలాల నుంచి అ. ధ్యక్షులు, శివగణేష్, ఉష అప్పారావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరికలు



పార్టీలో చేరిన వారితో భరత్‌కుమార్

అనకాపల్లి: రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షి తులై యువత వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని నియో జకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ అన్నారు. 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ ఆధ్వర్యంలో కరణాలవీధిలో టీడీపీ సీనియర్ నాయకులు శేఖరమంత్రి లక్ష్మణరావు, బాబు సమక్షం లో 25 మంది టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ భరత్‌కుమార్ కండువాలు కప్పి, పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. భరత్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటి వరకు టీడీపీ - జనసేన పార్టీల నుంచి 4వేల మంది తమ పార్టీలో చేరారని చెప్పారు. పార్టీలో చేరిన వారిలో శ్రీకాంత్, సురేష్, మూర్తి, రమణ, విష్ణుమూర్తి, ఎస్.లక్ష్మి, వి.పద్మావతి, పాప, గోవింద్, కమలప్రియ, రమాదేవి తదితరులున్నారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు గొన్నాబత్తుల వెంకటర మణ, కేతిరెడ్డి ప్రసాద్, పైడిరాజు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై శిక్షణ



జేసీ జాహ్నవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న చిన్నికృష్ణ



శిక్షణకు హాజరైన ఆర్వోలు, బీఎల్వోలు, అధికారులు

అనకాపల్లి: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతవాతారణంలో ప్రజలు తమ ఓటుహక్కును వినియోగించుకునేందుకు ప్రభుత్వం ప్రత్యేక ఏర్పా ట్లు చేస్తోందని జేసీ, నియోజకవర్గ ఎన్నికల అధికారిణి జాహ్నవి తెలిపారు. స్థానిక న్యూకాలనీ రోటరీ కల్యా ణమండపంలో మంగళవారం నియోజకవర్గస్థాయి ఆర్వో, బీఎల్వోలకు ఎన్నికల విధులపై శిక్షణా కార్య క్రమంలో ఆమె మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చినప్పటి నుంచి అధికారులు, బీఎల్వోలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎక్కడైనా సమస్య ఏర్పడితే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచిం చారు. కార్యక్రమంలో ఆర్డీవో ఏజే.చిన్నికృష్ణ, తహసీ ల్దార్ శ్రీనివాసరావు, ఆర్వోలు, బీఎల్వోలు పాల్గొన్నారు.

జోనల్ కార్యాలయ అభివృద్ధికి శ్రీకారం

- రూ.56 లక్షలతో మరమ్మతులకు భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, జెడ్సీ అయ్యప్పనాయుడు

అనకాపల్లి: జోనల్ కార్యాలయంలోని వివిధ విభాగాలను రూ.56లక్షల జీవీఎంసీ నిధులతో అభివృద్ధి చేయనున్నట్లు 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి తెలిపారు. ఈ మేరకు స్థానిక జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ ఒమ్మి అయ్యప్ప నాయుడుతో కలిసి, ఆమె భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జోనల్ కార్యాల యంలోని కొన్ని విభాగాల్లో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నందున మరమ్మతుల నిమిత్తం ఈ నిధులు ఖర్చు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సా ర్‌సీపీ జిల్లా కార్యదర్శి జాజుల రమేష్, జీవీఎంసీ ఈఈ సుమిత్ర, ఏపీడీ బీకే దొర, ఆర్వో సురేష్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు-1 ఉగ్గిన అప్పారావు, పార్టీ నేతలు పలకా సత్యనారాయణ, పేలూరి కల్యాణ్, మేడిశెట్టి గణేష్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన



రోగుల మందుల చీటీని పరిశీలిస్తున్న వైద్యుడు సాంబమూర్తి

అనకాపల్లి: స్థానిక దొడ్డి రామునాయుడు భవనం లో మంగళవారం ప్రజారోగ్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి స్పందన లభిం చింది. శిబిరంలో ఎన్టీఆర్ వైద్యాలయానికి చెందిన వైద్యుడు డి.సాంబమూర్తి రోగులకు వైద్యసేవలం దించారు. ఈ శిబిరంలో బీపీ, షుగర్, మూర్ఛ, పక్ష వాతం తదితర వ్యాధులకు పరీక్షలు చేసి, ఉచితం గా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు మీనేంద్రకుమార్, వేదిక సభ్యులు, ఎస్ఎఫ్ఐ విద్యార్థులు, పదవీ విరమణ చెందిన ఉద్యోగులు, స్వచ్ఛంద సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



అభివృద్ధి పనులకు భూమి పూజ చేస్తున్న దిలీప్‌కుమార్

అనకాపల్లి: మండలంలో మేజర్ పంచాయతీ తుమ్మపాలలో పలు అభివృద్ధి పనులకు ఏపీఐ డబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ మంగ ళవారం శ్రీకారం చుట్టారు. గ్రామంలోని ఇందిరా నగర్‌లో ఎంపీపీ నిధులు రూ.10 లక్షలతో సీసీ రోడ్లు, కల్యాణమండపాలకు మరమ్మతులతో పాటు 15వ ఆర్థికసంఘం నిధులు రూ.15 లక్ష లతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ తట్టా పెంటయ్యనా యుడు, వైస్ ఎంపీపీ విల్లూరి సూర్య కుమారి, చంద్రశేఖర్, అన్నపూర్ణ బ్యాంకు చైర్మన్ పీడీ గాం. దీ, ఉపాధ్యక్షుడు చదరం చిన్న, ఎంపీటీసీలు వడ్డాది భారతి , పన్నీరు వెంకటలక్ష్మి, పంచదార్ల కన్నారావు, పదాల గణపతి, ఎ.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తీర్థ మహోత్సవాలు



మాడుగుల రూరల్: దౌడు తీస్తున్న ఎడ్లు

బుచ్చెయ్యపేట: వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్‌లో మోదకొండమ్మ తీర్థ మహోత్సవం మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఇక్కడ మూడు రోజుల పాటు ఉత్సవం నిర్వహించనున్నారు. ఆలయ ధర్మ కర్త దొండా గిరిబాబు కుటుంబ సభ్యులకు తొలి దర్శనం కల్పించారు. కొత్తూరు,వడ్డాదికి చెం దిన భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

మాడుగుల/మాడుగుల రూరల్: పట్టణంలోని అర్బన్ కాలనీలో అభ యాంజనేయ స్వామి తీర్థం మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఉత్తరాంధ్ర ఎడ్ల పరుగు పందెం, బిళ్లకర్ర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమ తులు ప్రదానం చేశారు. వీరవల్లి అగ్రహారంలో మోదమాంబ తీర్థం ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు నిర్వహించారు.

ఎన్నికలకు మేం 'సిద్ధం'



ఉగ్గినపాలెంలో 'మేం సిద్ధం-మా బూత్ సిద్ధం' కార్యక్రమంలో నినాదాలు చేస్తున్న పార్టీ శ్రేణులు

కశింకోట: వైఎస్సార్ సీపీ విజయమే ధ్యేయంగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ మండల సచివాలయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు కోరారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సిద్ధం చేస్తూ మండలలోని ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమాదులపాలెం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట, పేరంటాలపాలెం, జోగా రావుపేట, తేగాడ గ్రామాల్లో ×మేం సిద్ధం-మా బూత్ సిద్ధం× కార్యక్రమాన్ని మంగళవారం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ జెండాలు చేతబూని జై జగన్.. జై భరత్‌కుమార్.. వైఎస్సార్ సీపీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు కార్యోన్ముఖు లను చేశారు. అనంతరం మాట్లాడుతూ గ్రామాల్లో పార్టీ శ్రేణులు ఇంటింటికీ వెళ్లి గత ఐదేళ్ల వైఎస్సార్ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించాలన్నారు. తద్వారా పార్టీ మరింత బలోపేతానికి, మళ్లీ వైఎస్ జగన్‌మో హన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడానికి దోహదపడాల న్నారు. పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్ గ్రామాల్లో వైఎస్సార్ సీపీ ప్రచారానికి అనుసరించా ల్సిన వ్యూహాల గురించి పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ కలగా లక్ష్మి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు గొల్లవిల్లి శ్రీనివా సరావు, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, సర్పంచ్‌లు కరక రాజ్యలక్ష్మి, శ్యాం, కోన నాయుడు, నీటిపల్లి ఈశ్వరమ్మ, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరక సోమునాయుడు, నీటిపల్లి లక్ష్మి, పేరంటాలపాలెం ఉప సర్పంచ్ వజ్రం శ్రీను, ఎంపీ టీసీ సభ్యులు గూడెపు లక్ష్మి, మంగతాయారు, వైఎ స్సార్‌సీపీ నాయకులు అద్దెపల్లి శ్రీను, గొంతిన శివ, నీటిపల్లి దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మేం సిద్ధం-మా బూత్ సిద్ధం'

కశింకోట: మండలంలోని పలు గ్రామాల్లో 'మేం సిద్ధం-మా బూత్ సిద్ధం' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల సచివా లయ కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు తెలిపారు. తీడ, చెరకాం, సుందర య్యపేట, జి. భీమవరం, అడ్డాం గ్రామాల్లో కార్యక్రమాన్ని నిర్వహిస్తామ న్నారు. వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

శ్రీ సత్యనారాయణ స్వామి వారి దేవస్థానం
దేవదాయ ధర్మదాయ శాఖ
సత్యనారాయణపురం, కశింకోట, అనకాపల్లి జిల్లా

టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన

అనకాపల్లి జిల్లా మరియు మండలం కశింకోట సత్యనారాయణపురంలో వేంచేసియున్న శ్రీ సత్యనారాయణస్వామి వారి దేవాలయం హక్కుభుక్తంలో గల కళ్యాణమండపం మరియు ఆలయ ప్రాంగణంలో శుభకార్యక్రమములు చేసుకున్న వారికి వారు కోరిన టెంట్స్ సప్లై చేసి వారి వద్ద నుండి మార్కెట్ రేటు ప్రకారం నేరుగా అద్దె సొమ్ము వసూలు చేసుకొను హక్కునకు తేది : 21-03-2024 ఉదయం 11 గంటలకు దేవాలయం వద్ద టెండర్ కం బహిరంగ వేలంపాట దేవదాయశాఖ అధికారుల సమక్షమున జరుపబడును. ఆసక్తి గలవారు రూ. 50,000/- ప్రథమ ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొనవచ్చును.
* ఇతర వివరములకు దేవస్థాన కార్యాలయం నందు గాని, ఫోన్ నెం. 9951065667లో గాని సంప్రదించవలెను.

అనకాపల్లి
తేది: 11-03-2024

శ్రీవారి సేవలో
కార్యనిర్వహణాధికారి

వడ్డాది పాపయ్య, గురునాథరావు విగ్రహాల ఆవిష్కరణ రేపు

కశింకోట: కశింకోటలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ వద్ద గురువారం ప్రముఖ చిత్ర కారుడు వడ్డాది పాపయ్య, మాజీమంత్రి దివంగత గుడివాడ గురునాథరావుల విగ్రహాల ఆవిష్కరణ జరగనుందని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. వీటిని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలునా యుడు ఆవిష్కరించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మం త్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి తదితరులు కార్యక్రమంలో పాల్గొంటారన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

అనకాపల్లి: సబ్బవరం నుంచి అనకాపల్లి వస్తున్న ద్విచక్రవాహనాన్ని సుంకర మెట్ట జంక్షన్ వద్ద లారీ ఢీకొనడంతో పట్టణానికి చెందిన చదరం శ్రీనివాసరావు తీవ్రంగా గాయపడ్డారు. ఘటనకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ నరసింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. సుంకరమెట్ట జంక్షన్ సమీపంలో ముందు వెళ్తున్న బైక్‌ను వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొన్న ప్రమాదంలో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ఎన్టీఆర్ వైద్యాలయానికి తరలించినట్లు ఎస్ఐ చెప్పారు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజే శారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనకాపల్లి :
9010973030, 9010546644
Office mail : sakshiadvtvsp@gmail.com